తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్

94949 23460

https://epaper.tharangalu.in

RNI. TELTEL / 2022 / 83463

జాతీయ దిన ప్రతిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
సోమవారం
23 మార్చి 2026
సంపుటి 03
సంచిక 164
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh

Epaper: www.tharangalu.in.com



## కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి గుడ్‌బై

- అవమానాలే కారణమని సంచలన వ్యాఖ్యలు
- 25న అధికారిక రాజీనామా నిర్ణయం
- పార్టీలో మానసిక క్షోభపై ఆవేదన
- తదుపరి రాజకీయాలపై ఉత్కంఠ

**జగిత్యాల, మార్చి 22 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి పార్టీని వీడాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత 20 నెలలుగా పార్టీలో ఎదుర్కొంటున్న అవమానాలు, అన్యాయాలు, మానసిక ఒత్తిడిని తాను ఇక భరించలేనని స్పష్టం చేసిన ఆయన, ఈ నెల 25న కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్టు ప్రకటించారు. ఈ నిర్ణయానికి సంబంధించి జీవన్‌రెడ్డి తన అనుచరులు, కార్యకర్తలకు లేఖ రాశారు. ఆ లేఖలో ఆయన తన ఆవేదనను స్పష్టంగా వ్యక్తం చేశారు. పార్టీలో తనకు గౌరవం లేకుండా, రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు

➢ మిగతా 2వ పేజిలో..

# ప్రభుత్వ పాఠశాలలకే ప్రాధాన్యం

- విద్యలో సంస్కరణలతో తెలంగాణ ముందుకు
- నర్మెట్టలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం
- రైతు భరోసా నిధుల విడుదల, అభివృద్ధి పనులకు శ్రీకారం
- విద్యార్థుల భవిష్యత్తుకు నూతన విధానాలు, స్కాలర్‌షిప్ హామీ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**సిద్ధిపేట, మార్చి 22 (తరంగాలు ప్రతినిధి):** ప్రైవేటు పాఠశాలలపై ఆధారపడకుండా ప్రభుత్వ బడులను ఎంపిక చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సిద్ధిపేట జిల్లా నర్మెట్టలో నిర్వహించిన 'ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, విద్యా రంగంలో సమగ్ర మార్పులకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థను అభివృద్ధి చేసి, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు విద్యాసంస్థలకు మించిన స్థాయికి తీసుకెళ్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం మీట నొక్కి రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేశారు. అదేవిధంగా నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ పామ్ కర్మాగారాన్ని ప్రారంభించి రైతులకు అంకితం చేశారు. జిల్లాలో రూ.775 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. ఈ చర్యలతో వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఊతమిస్తామని తెలిపారు. విద్యా రంగంపై ప్రత్యేకంగా స్పందించిన సీఎం, రాష్ట్రంలో లక్షకు పైగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని, 18 వేల ప్రభుత్వ పాఠశాలలను

➢ మిగతా 2వ పేజిలో..



## విద్యా రంగానికి కొత్త దిశ

- వేగంగా యంగ్ ఇండియా పాఠశాలల నిర్మాణాలు
- మధిరలో పనుల పరిశీలన
- నాణ్యతపై దృష్టి, వేగంపై ఆదేశాలు
- గ్రామీణ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**మధిర, మార్చి 22(తరంగాలు ప్రతినిధి):** రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో మధిర నియోజకవర్గ పర్యటనలో భాగంగా బోనకల్లు మండలం లక్ష్మీపురంలో జరుగుతున్న నిర్మాణ పనులను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లూ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్ట్ పురోగతిపై ప్రత్యక్షంగా అవగాహన పొందుతూ, పనుల ప్రస్తుత స్థితిని సమీక్షించారు. పాఠశాలల్లో నిర్మాణంలో

➢ మిగతా 2వ పేజిలో..

## భవిష్యత్తు అభివృద్ధి దిశగా చంద్రబాబు దార్శనికత...

- ఐఎస్బీ వేదికగా కీలక ప్రసంగం
- హైదరాబాద్ అభివృద్ధి ప్రయాణం గుర్తుచేసిన సీఎం
- స్వర్ణాంధ్ర లక్ష్యంగా విజన్ 2047
- అమరావతి, పోలవరం పై స్పష్టమైన ప్రణాళికలు



**హైదరాబాద్, మార్చి 22 తరంగాలు (ప్రతినిధి):** హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్లో నిర్వహించిన సౌత్ ఏషియా లెర్నింగ్ సమ్మిట్--2026లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రసంగం చేశారు. 'ది ఫ్యూచర్ ఆఫ్ ఎవ్రీథింగ్' అంశంపై మాట్లాడిన ఆయన, అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన మూడు ప్రధాన స్తంభాలుగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధి గురించి మాట్లాడుతూ, ఒకప్పుడు బంజరు భూమిగా ఉన్న ప్రాంతాన్ని ప్రపంచ ఐటీ కేంద్రంగా మార్చిన ప్రస్థానాన్ని వివరించారు. సైబరాబాద్ ప్రాంతం పాములు, ముళ్లపొదలతో నిండిన భూమి నుంచి హైటెక్ సిటీగా ఎలా మారిందో వివరించారు. పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో కేవలం 15 నెలల్లో హైటెక్ సిటీ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. బిల్ గేట్స్తో జరిగిన సమావేశం ద్వారా మైక్రోసాఫ్ట్ కేంద్రాన్ని హైదరాబాద్‌కు తీసుకురావడం కీలక మలుపుగా నిలిచిందన్నారు. అలాగే ఐఎస్బీ, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులను తీసుకురావడంలో తన పాత్రను గుర్తుచేశారు. ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఒప్పించి హైదరాబాద్‌ను విద్యా, పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అభివృద్ధి చేసినప్పటికీ రాజకీయంగా ఎదురుదెబ్బలు తగిలిన విషయాన్ని అంగీకరిస్తూ, అభివృద్ధితో పాటు రాజకీయ సమతుల్యత కూడా అవసరమని తన అనుభవాలు నేర్పాయని పేర్కొన్నారు.

విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి అభివృద్ధి దిశగా

➢ మిగతా 2వ పేజిలో..



## బంగ్లాదేశ్‌లో ఘోర రైలు ప్రమాదం... 12 మంది మృతి

- బస్సును ఢీకొన్న రైలు
- కుమిల్లా జిల్లాలో విషాదం
- పలువురికి తీవ్ర గాయాలు

**కుమిల్లా, మార్చి 22 తరంగాలు (ప్రతినిధి):** బంగ్లాదేశ్లో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. కుమిల్లా జిల్లాలోని పదువా బజార్ క్రాసింగ్ వద్ద ఢాకా--చట్టోగ్రామ్ ప్రధాన మార్గంలో ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్‌లను దాటుతున్న బస్సును ఢాకా వైపు వెళ్తున్న రైలు ఢీకొట్టడంతో ఈ విషాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కనీసం 12 మంది అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఢీకొన్న ప్రభావం తీవ్రంగా ఉండటంతో బస్సు పూర్తిగా నుజ్జునుజ్జైపోయింది. ప్రమాద సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు తీవ్ర గాయాలకు గురయ్యారు. పోలీసుల ప్రకారం, రైలు ఢీకొన్న తర్వాత కూడా వెంటనే ఆగకపోవడంతో బస్సును దాదాపు అర కిలోమీటరు దూరం ఈడ్చుకెళ్లింది. దీంతో ప్రాణనష్టం మరింత పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఘటన స్థలంలో హృదయ విదారక దృశ్యాలు కనిపించాయి. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించాయి. మృతదేహాలను

➢ మిగతా 2వ పేజిలో..

## మోదీ సరికొత్త రికార్డు...

- అత్యధిక రోజులు ప్రభుత్వాధినేతగా కొనసాగిన నాయకుడు!
- 8,391 రోజుల మైలురాయి సాధన
- సీఎంగా, ప్రధానిగా నిరవధిక సేవ
- చరిత్రలో నిలిచిన రాజకీయ ప్రయాణం

➢ 2వ పేజిలో..



## విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యం

- భారత్ ఎలక్ట్రిసిటీ సమ్మిట్‌లో చర్చలు
- ఢిల్లీలో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సమావేశం
- వికసిత భారత్ దిశగా రోడ్‌మ్యాప్‌పై చర్చ
- విద్యుత్ కొరత నుంచి దేశం ముందడుగు అని వ్యాఖ్యలు



➢ 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక
# తరంగాలు
THARANGALU DAILY NEWS
సోమవారం, 23 మార్చి, 2026



## ప్రభుత్వ పాఠశాలలకే ప్రాధాన్యం

➢ మొదటి పేజీ తరువాయి



పూర్తిగా ప్రక్షాళన చేసే బాధ్యత తీసుకున్నామని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'ను ప్రారంభించి, నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు సమగ్ర విద్య అందించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉపాధ్యాయులు ఉన్నారని సీఎం స్పష్టం చేశారు. కాబట్టి తల్లిదండ్రులు ప్రైవేటు మోజులో పడకుండా తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని సూచించారు. విద్యార్థులలో ప్రతిభను పెంపొందించేందుకు ఆధునిక సదుపాయాలు, నూతన పాఠ్య విధానాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను దేశంలోనే ఆదర్శంగా నిలబెట్టడమే లక్ష్యమని పేర్కొన్నారు. సాంకేతిక నైపుణ్యాలపై కూడా సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన ప్రతీ ఒక్కరికీ ఉద్యోగం వస్తుందనే గ్యారెంటీ లేదని, కానీ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో చదివే విద్యార్థులకు ఉపాధి కల్పించే బాధ్యత తమదేనని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు ప్రతి నెల రూ.2 వేల చొప్పున స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. యువత స్వయం సాధికారత సాధించి, ప్రపంచ స్థాయిలో నిలబడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి, ఎంపీలు వేముల నరేందర్ రెడ్డి, రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌కు జీవన్‌రెడ్డి గుడ్‌బై

➢ మొదటి పేజీ తరువాయి

సృష్టిస్తున్నారని ఆరోపించారు. నిరంతరం అవమానాలను ఎదుర్కొంటూ కొనసాగడం తనకు సాధ్యం కాదని పేర్కొన్నారు. ఈ పరిస్థితులు తనను మానసికంగా తీవ్రంగా బాధించాయని, చాలా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నానని వివరించారు.తన భవిష్యత్ రాజకీయ ప్రస్థానంపై త్వరలోనే స్పష్టత ఇస్తానని జీవన్‌రెడ్డి తెలిపారు. స్థానిక నేతలు, తనను అనుసరిస్తున్న కార్యకర్తలతో చర్చించి, వారి అభిప్రాయాలను తెలుసు కున్న తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తానని పేర్కొన్నారు. "నా రాజకీయ జీవితంలో మీ సహకారం ఎంతో ముఖ్యమైనది. మీ సూచనలు, మార్గదర్శనం నాకు అవసరం" అంటూ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతో ఆయన తదుపరి రాజకీయ అడుగులు ఏవైపు ఉంటాయన్నదానిపై ఆసక్తి పెరిగింది. జీవన్‌రెడ్డి నిర్ణయంతో జగిత్యాల జిల్లా రాజకీయాల్లో వేడి పెరిగింది. ఆయన ఏ పార్టీలో చేరతారన్నదానిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చలు సాగుతున్నాయి. ఆయనతో పాటు మరికొందరు నాయకులు కూడా పార్టీని వీడే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామం స్థానిక రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీకి ఇది ఒక పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. సీనియర్ నాయకుడైన జీవన్‌రెడ్డి పార్టీని వీడటం వల్ల పార్టీ బలహీనపడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాల్లో ఈ నిర్ణయం కీలక మార్పులకు దారితీయవచ్చని అంచనా వేస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో ఘోర రైలు ప్రమాదం... 12 మంది మృతి

➢ మొదటి పేజీ తరువాయి

బయటకు తీసి గుర్తింపు ప్రక్రియ ప్రారంభించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ట్రాక్ దాటే సమయంలో నిర్లక్ష్యం లేదా సిగ్నల్ వ్యవస్థలో లోపం కారణమై ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

## ధోనీ ఎంట్రీ.. భావోద్వేగానికి గురైన యువతి



ఐపీఎల్ 2026 సందడి మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. మార్చి 28న ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. ఈ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ 'రోర్ 2026' పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది. చెన్నైలోని చెపాక్ స్టేడియంలో ఫ్రాంచైజీ ప్రస్తుత, మాజీ క్రికెటర్లు వేర్వేరు జట్లుగా ఏర్పడి సరదాగా ఓ మ్యాచ్ ఆడారు. అయితే ఈ మ్యాచ్‌కు ధోనీ రావడంతో స్టేడియం హోరెత్తింది. ఓ యువతి ధోనీని చూసి తీవ్ర భావోద్వేగానికి గురైంది. దానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సీఎస్కే ప్లేయర్లంతా ప్రాక్టీస్‌లో మునిగిన సమయంలో ధోనీ మైదానంలోకి ఎంట్రీ ఇచ్చాడు. పెవిలియన్ ఎండ్ నుంచి చిన్నగా నడుచుకుంటూ గ్రౌండ్‌లోకి వచ్చాడు. ఒక్కసారిగా స్టేడియమంతా ధోనీ నామ స్మరణతో మార్మోగిపోయింది. అయితే ధోనీ 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నేటి వరకు ఐపీఎల్‌లో మాత్రం ఆడుతూ అభిమానులను అల రిస్తున్నాడు. 'ధోనికిదే ఆఖరి సీజన్' అంటూ సోషల్ మీడియా లో వార్తలు తెగ ప్రచారం జరుగుతున్న నేపథ్యం లో.. అతడిని నేరుగా చూసిన అభిమా నులు దు:ఖాన్ని ఆపుకోలేకపోయారు.

### సీఎస్కే మాజీలు.. ఇప్పుడిలా..

ఇప్పటి వరకు సీఎస్కే ఐదు ఐపీఎల్ ట్రోఫీలను ముద్దాడిన సంగతి తెలిసిందే. టీమ్ తొలినాళ్లలో ఆడిన సీనియర్ ఆటగాళ్లతో ప్రస్తుత జట్టుకు చెన్నైలో మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్లు మరోసారి మైదానంలోకి దిగి అభిమానులను అలరించారు. వారి ఎంట్రీ సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది. సీఎస్కే తమ ఎక్స్ ఖాతాలో ఈ వీడియో పోస్ట్ చేసింది.

## విద్యా రంగానికి కొత్త దిశ

➢ మొదటి పేజీ తరువాయి



ఉన్న అకాడమిక్ బ్లాక్స్, అడ్మినిస్ట్రేటివ్ భవనాలు, సైన్స్ మరియు కంప్యూటర్ ల్యాబ్స్, హాస్టల్ భవనాల పురోగతిని ఆయన సమగ్రంగా పరిశీలించారు. పనులు ప్రణాళిక ప్రకారం జరుగుతున్నాయా లేదా అన్నదానిపై అధికారులను ప్రశ్నించారు. పనుల్లో ఎలాంటి ఆలస్యం లేకుండా వేగం పెంచాలని, ప్రతి దశను సమయానికి పూర్తి చేయాలని గుత్తేదారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని ఆయన ప్రత్యేకంగా సూచించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉపయోగించుకునే సదుపాయాలు కాబట్టి నిర్మాణాలు బలంగా, ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. సదుపాయాల విషయంలో కూడా అత్యుత్తమ ప్రమాణాలు పాటించాలని, ల్యాబ్స్, హాస్టళ్లలో అన్ని అవసరాలు సమకూర్చాలని సూచించారు. విద్యపై పెట్టే ప్రతి రూపాయి రాబోయే తరాల భవిష్యత్తుకు పెట్టుబడిగా నిలుస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పాఠశాలలు పూర్తయిన తర్వాత గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నగర స్థాయి విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని, దీంతో విద్యా అసమానతలు తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. సమగ్ర విద్యా అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ రాష్ట్ర విద్యా రంగంలో కీలక మార్పులకు దారితీయనున్నాయి. ఆధునిక సదుపాయాలు, నాణ్యమైన బోధనతో విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచే అవకాశముందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్ విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసి, భవిష్యత్తు తరాలకు బలమైన పునాది వేస్తుందని పేర్కొంటున్నారు.

## భవిష్యత్తు అభివృద్ధి దిశగా చంద్రబాబు దార్శనికత...

➢ మొదటి పేజీ తరువాయి



తీసుకెళ్లడమే తన లక్ష్యమని చంద్రబాబు తెలిపారు. గత 21 నెలల్లో రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే లక్ష్యమని చెప్పారు. గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాయని, భారీ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. 2047 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే విజన్‌ను వివరించారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులను రాష్ట్ర భవిష్యత్తుకు కీలకంగా అభివర్ణించిన ఆయన, అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మిస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. సంపద సృష్టితో పాటు సామాజిక బాధ్యత కూడా ముఖ్యమని పారిశ్రామికవేత్తలకు సూచిస్తూ, పీపీపీ మోడల్‌కు తోడు పీ4 (పీపుల్-పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం) విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

## ప్రభాస్ కల్కి 2లో జేడీ చక్రవర్తి..

### హైదరాబాద్ షెడ్యూల్‌లో బిజీబిజీ..?



ప్రభాస్ లీడ్ రోల్‌లో నటించిన సైన్స్ ఫిక్షన్ జోనర్ కల్కి 2898 ఏడీ . మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సీక్వెల్ కల్కి 2 కూడా రాబోతుందని తెలిసిందే. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. సీక్వెల్‌పై ఆసక్తికర వార్త ఒకటి అభిమానులు, మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. టాలీవుడ్ యాక్టర్ జేడీ చక్రవర్తి కల్కి 2 టీంతో జాయిన్ అయ్యాడట. తాజా టాక్ ప్రకారం జేడీ చక్రవర్తి హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్‌లో దుల్కర్ సల్మాన్, అమితాబ్ బచ్చన్ కలిసి జాయిన్ అయ్యాడని ఇన్‌సైడ్ టాక్. కాగా డైరెక్టర్ నాగ్ అశ్విన్ జేడీ చక్రవర్తికి ఎలాంటి రోల్ ఇచ్చాడు.. దీనిపై నాగ్ అశ్విన్ టీం నుంచి ఏదైనా అఫీషియల్ అప్‌డేట్ వస్తుందేమో చూడాలి మరి. కల్కి 2లో దీపికా పదుకొనే ప్లేస్‌లో మరో నటిని తీసుకోనుండగా.. అది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది.

వైజయంతీ మూవీస్ తెరకెక్కించిన కల్కి 2898 ఏడీ ప్రపంచవ్యాప్తంగా 2024 జూన్ 27న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదలై.. గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.1100 కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. కల్కి 2898 ఏడీలో బాలీవుడ్ భామ దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటించగా.. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర కీలక పాత్రలు పోషించారు. బెంగాలీ నటుడు శాశ్వత ఛటర్జీ విలన్‌గా నటించాడు.ఫస్ట్ పార్టులో కనిపించిన అన్ని పాత్రలు సీక్వెల్‌లో ఉంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది.

## మోదీ సరికొత్త రికార్డు...

- అత్యధిక రోజులు ప్రభుత్వాధినేతగా కొనసాగిన నాయకుడు!
- 8,391 రోజుల మైలురాయి సాధన
- సీఎంగా, ప్రధానిగా నిరవధిక సేవ
- చరిత్రలో నిలిచిన రాజకీయ ప్రయాణం



**డెస్క్, మార్చి 22 తరంగాలు (ప్రతినిధి):** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించారు. ప్రభుత్వాధినేతగా మొత్తం 8,391 రోజులు పూర్తి చేసి దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించారు. సీఎంగా, ప్రధానిగా కలిపి 24 ఏళ్లకు పైగా ఎలాంటి విరామం లేకుండా పదవిలో కొనసాగడం ద్వారా ఈ ఘనత సాధించారు. ఈ క్రమంలో ఇప్పటివరకు 8,390 రోజులు పదవిలో కొనసాగిన పవన్ కుమార్ ఛామ్లింగ్ రికార్డును మోదీ అధిగమించారు. మోదీ 2001లో గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత 2014 వరకు సీఎంగా కొనసాగి, అనంతరం దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం కూడా ప్రధానిగా కొనసాగుతున్న ఆయన, గుజరాత్‌కు అత్యధిక కాలం సీఎంగా పనిచేసిన నేతగా నిలిచారు. ముఖ్యమంత్రిగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రయాణం, ప్రధానిగా మూడు సార్లు విజయంతో మరింత బలపడింది.

2014, 2019, 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా విజయాలు సాధించి మోదీ హ్యాట్రిక్ సాధించారు. ఈ క్రమంలో మూడు సార్లు ఎన్నికల్లో విజయం సాధించిన జవహర్ లాల్ నెహ్రూ రికార్డును సమం చేశారు. అలాగే వరుసగా అత్యధిక రోజులు ప్రధానిగా కొనసాగిన రెండో నాయకుడిగా నిలిచి, ఇందిరా గాంధీ రికార్డును దాటారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మోదీకి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో అత్యధిక కాలం ప్రభుత్వాధినేతగా కొనసాగిన నాయకుడిగా మోదీ చరిత్రలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరుచుకున్నారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యం

**న్యూఢిల్లీ, మార్చి 22 తరంగాలు (ప్రతినిధి):** దేశాన్ని స్వయం సమృద్ధి, వికసిత భారత్ దిశగా నడిపించేందుకు విద్యుత్ రంగంలో చేపట్టాల్సిన చర్యలపై 'భారత్ ఎలక్ట్రిసిటీ సమ్మిట్--2026'లో విస్తృత చర్చలు జరిగాయి. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యుత్ రంగ భవిష్యత్ అభివృద్ధి, సామర్థ్యాల పెంపు, నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యాలపై చర్చించినట్లు తెలిపారు. దేశాన్ని ఆత్మనిర్భర్, వికసిత భారత్‌గా తీర్చిదిద్దడంలో విద్యుత్ రంగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. శక్తి రంగంలో సంస్కరణలు, సాంకేతికత వినియోగం, మౌలిక సదుపాయాల విస్తరణపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని వివరించారు.తాను తెలంగాణలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పరిశ్రమలు, కార్మికులు విద్యుత్ సరఫరా కోసం తరచూ ఆందోళనలు చేసిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో విద్యుత్ కొరత ప్రధాన సమస్యగా ఉండేదని తెలిపారు. అయితే గత దశాబ్దంలో దేశం విద్యుత్ రంగంలో గణనీయమైన మార్పులు సాధించిందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో విద్యుత్ రంగంలో సంస్కరణలు అమలు చేసి, దేశాన్ని విద్యుత్ కొరతల నుంచి బయటపడే దిశగా తీసుకెళ్లామని కిషన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేసి, పరిశ్రమల అభివృద్ధికి మద్దతు అందించేలా చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వృద్ధిలో విద్యుత్ రంగం కీలకంగా మారుతుందని, సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.

THARANGALU DAILY NEWS
సోమవారం, 23 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# నిబంధనలు పాటించకుండా ఎయిర్టెల్ నెట్వర్క్ సంస్థ కేబుల్ తవ్వకాలు



- తవ్వకాలతో పైప్ లైన్ లీకేజీ తో త్రాగు నీటి అంతరాయం
- ఆగ్రహం వ్యక్తం చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ - పెండెం శ్రీలక్ష్మి రామానంద్

**తరంగాలు, మార్చి:22, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గం పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ రోడ్డు, ద్వారకా పేట మెయిన్ రోడ్డు నందు ఎలాంటి అనుమతులు లేకుండా ఎయిర్టెల్ నెట్వర్క్ సంస్థ భారీ వైబ్రేటర్ మిషన్ వాహనంతో కేబుల్స్ వేసేందుకు తవ్వకాలు జరపడం జరిగింది. అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా రోడ్లను తవ్వడం వలన మెయిన్ వాటర్ పైప్ లైన్ పగిలిపోవడంతో నీటి సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎయిర్టెల్ నెట్వర్క్ సంస్థ యాజమాన్యం, ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ మున్సిపాలిటీ నుండి సరైన అనుమతి తీసుకోకుండా రాత్రికి రాత్రే తవ్వకాలు జరపడం సరైనది కాదు అంటూ మండిపడ్డారు. పగిలిన పైప్ లైన్ లను వెంటనే మరమ్మత్తులు చేసి ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి తవ్వకాలు జరిపిన ఎయిర్టెల్ నెట్వర్క్ సంస్థ యాజమాన్యంపై చైర్ పర్సన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి.. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయించడం జరిగింది. ఇకముందు మిషన్లతో తవ్వకాలు జరపకూడదని, ప్రైవేట్ సిబ్బంది చేత పనులు చేయించాలని హెచ్చరించారు. వీలైనంత తొందరగా దెబ్బతిన్న పైప్ లైన్ లను మరమ్మత్తులు పూర్తి చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్ర యాకూబ్ రెడ్డి, కౌన్సిలర్ లు బీరం భరత్ రెడ్డి, హనుమకొండ శ్రీధర్, బాణాల ప్రసన్న శ్రీనివాస్, పొన్నాల మనీషా ప్రకాష్, సీనియర్ నాయకులు కాట ప్రభాకర్, కీసర వెంకటేశ్వర్లు, యూత్ నాయకులు మెరుగు కిరణ్, ఉప్పుల శాలూమ్, దేవోజు హేమంత్, చీకటి శివమణి, టౌన్ వాటర్ లైన్ ఇంచార్జ్ కాట శ్రీను, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది దంపతులు



**తరంగాలు, మార్చి:22, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి**

నర్సంపేట నియోజకవర్గం నెక్కొండ మండలం మాజీ ఎంపీపీ, తెలంగాణ రాష్ట్ర మాజీ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మెంబర్ ఘటిక అజయ్ కుమార్ 25 వసంతాల పెళ్లిరోజు వేడుక ను హైదరాబాద్ నగరం లోని కొండాపూర్ లో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఏర్పాటు చేయగా మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి దంపతులు హాజరై అజయ్ కుమార్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెక్కొండ మండల బి.ఆర్.ఎస్ అధ్యక్షులు సంఘని సూరయ్య, మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి శివకుమార్, మాజీ జెడ్పిటిసి సరోజ హరి కిషన్ నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ధోనికేనా సారంగపాణి, కట్కూరి నరేందర్ రెడ్డి, నెక్కొండ పట్టణ మాజీ ఉపసర్పంచ్ దేవానబోయిన వీరభద్రం, మండల నాయకులు బక్కి కుమారస్వామి, మాతంగి రాజు, గొల్లపల్లి సర్పంచ్ మైల కుమారస్వామి, మాజీ సర్పంచ్ లింగాల విజయ వెంకన్న, సర్పంచ్ శీలం వెంకన్న, చెరుకు లెనిన్, బాదావత్ వీరస్వామి, బోడ అనిల్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జలం - జీవన జ్యోతి

మంజుల పత్తిపాటి



నిశీధిలోనూ వినిపించే నిశ్శబ్ద గానం
అది జలధారల మృదుస్పర్శ;
చుక్కగా పడి నేలను తాకే వేళ,
భూమి హృదయం హర్షంతో కొట్టుకుంటుంది।
అదృశ్యంగా సాగిపోతున్న ప్రతి చుక్కలో,
అనంతకాలపు ఆశలు దాగి ఉంటాయి;
దాన్ని అర్థం చేసుకున్న మనసే మహోన్నతం,
దాన్ని వృధా చేసిన వేళ కాలమే ప్రశ్నిస్తుంది।
వెలుగు చూడని విత్తనాలకైనా జీవం ఇచ్చేది,
నిశ్శబ్దంగా జారే నీటి కరుణ;
ఆ కరుణను కాపాడే చేతులే,
భవిష్యత్తు వేదికను నిర్మించే శిల్పులు।
ఎండిన నేలపై పగుళ్లు పడిన వేళ,
ఆర్తనాదం వినిపించేది ప్రకృతిదే;
ఆ స్వరం అర్థం చేసుకున్న మనిషి,
జలాన్ని దేవతగా భావించి కాపాడతాడు।
ఇంటి తలుపు దగ్గర జారే ఒక చుక్కనుంచి,
ప్రపంచపు ప్రవాహాల వరకూ---
సంరక్షణ అనే ఒక చిన్న నిర్ణయం,
విశాలమైన మార్పుకు మార్గదర్శకం అవుతుంది।
జలమే కాదు---మనసాక్షి కూడా అదే,
దాన్ని కాపాడటం అంటే మనల్ని మనం కాపాడటం;
చుక్కను దాచిన వేళ చరిత్ర నిలుస్తుంది.
ప్రకృతికి మనం ఇచ్చే అతి పెద్ద కానుక 'నీటి సంరక్షణ
నీటిని ప్రతి ఒక్కరూ ఆదా చేయాలని కోరుకుంటూ...

**రచన: మంజుల పత్తిపాటి**

**చరవాణి 9347042218**

**యాదాద్రి భువనగిరి జిల్లా**

**తెలంగాణ రాష్ట్రం**

## యాదాద్రిలో విషాదం

- అప్పుల భారంతో రైతు బలవన్మరణం
- పంట నష్టంతో తీవ్ర ఆవేదన
- రూ.20 లక్షల అప్పులు భారం
- పురుగుల మందు తాగి ఆత్మహత్య



**యాదాద్రి భువనగిరి, మార్చి 22 తరంగాలు,:** యాదాద్రి భువనగిరి జిల్లాలో అప్పుల భారాన్ని తట్టుకోలేక రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. ఆత్మకూరు(ఎం) మండలంలోని రాయిపల్లి గ్రామానికి చెందిన రైతు నాతి మల్లయ్య గౌడ్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, మల్లయ్య గౌడ్ తనకున్న నాలుగు ఎకరాల భూమితో పాటు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని మొత్తం ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట కోసం భారీగా పెట్టుబడి పెట్టి, దొరికిన చోటల్లా అప్పులు చేసి వ్యవసాయం కొనసాగించాడు. అయితే పంట చేతికొచ్చే సమయానికి సాగునీరు అందకపోవడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. ఈ పరిస్థితితో మల్లయ్య తీవ్రంగా నష్టపోయాడు. ఇప్పటికే తీసుకున్న వ్యవసాయ అప్పులకు తోడు, కూతురు పెళ్లి కోసం చేసిన ఖర్చులు కూడా అతనిపై మరింత భారంగా మారాయి. మొత్తం సుమారు రూ.20 లక్షల అప్పు ఎలా తీర్చాలనే ఆందోళనతో తీవ్ర మనోవేదనకు గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పుల ఒత్తిడి, పంట నష్టం కారణంగా నిరాశలోకి వెళ్లిన మల్లయ్య చివరకు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన గ్రామంలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రైతుల ఆత్మహత్యల సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## హుస్సేన్ నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ డిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్




**తరంగాలు, మార్చి:22, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి** :హుస్సేన్ నాయక్ కుటుంబాన్ని మాజీ డిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్ పరామర్శించారు.జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి లచ్చ నాయక్ ఇటీవల మృతి చెందాడు.విషయం తెలుసుకున్న మాజీ డిసిఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్ ముచ్చర్ల గ్రామం చేరుకొని లచ్చ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి,బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు . ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లకావత్ వసంత, ప్రవీణ్ నాయక్, మాజీ జెడ్పిటిసి గుగులోతు బాలు నాయక్, మాజీ సర్పంచ్ భూక్య వెంకన్న, స్థానిక నాయకులు, బంధువులు పాల్గొన్నారు .

## అరబిందో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 22,తరంగాలు** : శ్రీ అరబిందో హైస్కూల్‌లో 2001-2002 విద్యాసంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం సందడిగా జరిగింది. దశాబ్దాల తర్వాత స్నేహితులంతా ఒక్కచోట చేరడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డితో పాటు ఉపాధ్యాయులు లక్ష్మణ్, సత్యం, ఓంకార చారి, సుధాకర్, మాధవి తదితరులను విద్యార్థులు శాలువాలతో ఘనంగా సన్మానించి, ఆశీస్సులు తీసుకున్నారు.చిన్ననాటి అల్లరి పనులు, పాఠశాల రోజులను గుర్తు చేసుకుంటూ విద్యార్థులు రోజంతా ఉత్సాహంగా గడిపారు. తమ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉండటం గర్వంగా ఉందని ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంతోష్ కుమార్, ఫణికుమార్, పరమేశ్వరి, మాధవి, ప్రదీప్, శ్రీధర్, గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో కోల్డ్ స్టోరేజీ అగ్నిప్రమాదం

- బాధితులకు ప్రభుత్వం అండ
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన భట్టి విక్రమార్క
- రైతులకు త్వరిత పరిహారం ఆదేశాలు
- మిర్చి మార్కెట్‌లో క్రమబద్ధీకరణపై దృష్టి



**మధిర, మార్చి 22 తరంగాలు,:** మధిర మండలం ఆత్కూరులోని శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో చోటుచేసుకున్న అగ్నిప్రమాద ఘటనపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లూ స్పందించారు. ఈరోజు ప్రమాద స్థలాన్ని స్వయంగా పరిశీలించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఘటనలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కోల్డ్ స్టోరేజీలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అగ్నిప్రమాదం వల్ల మిర్చి నిల్వలు భారీగా నష్టపోయినట్లు ప్రాథమిక సమాచారం అందిందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులకు నష్టపరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బీమా నిబంధనల ప్రకారం పరిహారం చెల్లింపులను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని పేర్కొన్నారు. బాధిత రైతులకు తక్షణ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అదే సమయంలో మధిర మార్కెట్‌లో మిర్చి కొనుగోలు ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సరైన ధర లభించేలా, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెట్ వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దాలని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా కఠిన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కోల్డ్ స్టోరేజీల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, నియమిత తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ ఘటనపై పూర్తి నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వం ముందు ఉంచాలని అధికారులను ఆదేశించారు.

# నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి





- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క

**హనుమకొండ ప్రతినిధి, మార్చి 22,తరంగాలు :** మానవ మనుగడకు నీరు అనేది ప్రాణాధారమని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లాఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామంలో గ్రామ సర్పంచ్ దేవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి అనసూయ సీతక్క తో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోకపోతే రానున్న రోజుల్లో మానవ మనుగడకే ముప్పు ఏర్పడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ప్రపంచ నీటి దినోత్సవాన్ని నేడు జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు నీటిని వృధా చేయకుండాపొదుపుగా వాడుకున్నప్పుడే భావి తరాలకు నీటి ఇబ్బందులు ఏర్పడవని పేర్కొన్నారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ప్రతి ఒక్కరూ తమఇంటి పరిసర ప్రాంతాల్లో ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విచ్చలవిడిగా నీటిని వృధాచేయడం వల్ల నీటిని కొనుక్కునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. చెట్లు పెంచని పక్షంలో రానున్న రోజుల్లో గాలిని సైతం కొనాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలకు సమీపంలోని చెరువులను కాపాడుతూనేఅడవులను కాపాడుకోవాలని, సూచించారు. గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. వాటర్ ప్లాంట్ల పై ఆధారపడకుండా గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని వినియోగించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న శుద్ధమైన నీరు వినియోగంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా పంటలకు అధిక రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారని, వాటి వినియోగాన్ని తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. రసాయనిక ఎరువులు వినియోగం పెరగడంతో క్యాన్సర్, ఇతర అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నాయని అన్నారు. ఈ సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో మిషన్ భగీరథ నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవనానికి మూలాధారమైన పంచభూతాలైన గాలి నీరు నిప్పు ఆకాశము భూమిని ఇంత పరిశుభ్రంగా ఉంచితే మనతోపాటు భవిష్యత్ తరాలకు అంతా మేలు కలుగుతుందన్నారు. రాబోయే తరాలకు పర్యావరణం పంచభూతాలను పరిరక్షించుకోవాల్సిన ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. విలువైన నీరును వృధా చేయవద్దని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి అన్నారు. నీటిని పొదుపుగా వాడుతూ భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాలకు ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ ఇచ్చి శుద్ధమైన నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లోనూ గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ద్వారా పంపిణీ చేస్తున్న శుద్ధ నీరు, ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నుండి వినియోగించే నీరు గురించి అధికారులు డెమో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, మిషన్ భగీరథ ఈఈ గాయత్రి, స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# రైతు మహోత్సవ కార్యక్రమానికి బయలుదేరిన పరకాల రైతు సోదరులు






**పరకాల, మార్చి 22, తరంగాలు :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట లో రైతు మహోత్సవ కార్యక్రమం నిర్వహించబోయే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ,మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విచ్చేస్తున్న రైతు మహోత్సవ కార్యక్రమంలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం మరియు రైతు భరోసా డబ్బులు రైతుల అకౌంట్లోకి ప్పంపిస్తున్న శుభసందర్భంగా పరకాల నుండి పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి,పరకాల మండల ఏంఏఓ శ్రీనివాస్, ఎఇఒ రాజా, ఏంఇఒ మరిపెల్లి శైలజ,ఎంపిసీ డైరెక్టర్స్ పెండ్యాల కుమారస్వామి, బొమ్మకంటి రుద్రమదేవి చంద్రమౌళి, వెల్లంపల్లి మాజీ సర్పంచ్ నలుబోలు కిష్టయ్య పరకాల పట్టణ 11వ వార్డు కౌన్సిలర్ గుడెల్లీ సదన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పరకాల పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ మంద నాగరాజు, కాంగ్రెస్ నాయకులు, పబ్బ శ్రీనివాస్,అల్లం శ్రీరామ్, బొచ్చు అనంతరావు,మంద వెంకటేష్,సుదమల్ల కిషోర్,కొక్కిరాల తిరుపతిరావు, వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున రైతులు బయలుదేరి వెళ్లడం జరిగింది .

# తెలంగాణలో నైపుణ్య విద్యలో సంస్కరణలు

- పాలిటెక్నిక్, ఐటీఐలు స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి
- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు
- యువతకు ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యం



**హైదరాబాద్, మార్చి 22 తరంగాలు :** తెలంగాణలో నైపుణ్యాభివృద్ధి విద్యలో ప్రభుత్వం కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను పెంచే లక్ష్యంతో, రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయం తీసుకుంది. దీంతో నైపుణ్య శిక్షణకు సంబంధించిన అన్ని సంస్థలు ఒకే వ్యవస్థ కింద పని చేయనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 113 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలు ఈ వర్సిటీ పరిధిలోకి రానున్నాయి. దీంతో ఇప్పటివరకు ఈ కాలేజీల సిలబస్, పరీక్షలను నిర్వహిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) రద్దు కానుంది. అదేవిధంగా కార్మిక శాఖ పరిధిలోని 63 ప్రభుత్వ అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు, 219 ప్రైవేట్ ఐటీఐలు కూడా ఈ యూనివర్సిటీ పరిధిలోకి చేరనున్నాయి. ఈ సమగ్ర మార్పుల్లో భాగంగా పరిశ్రమల శాఖ కింద ఉన్న స్కిల్స్ యూనివర్సిటీని ఉన్నత విద్యాశాఖ పరిధిలోకి మార్చే నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ విద్యా కమిషన్ సూచించిన 'విద్యా విధానం-2026' సిఫార్సులకు అనుగుణంగా ఈ సంస్కరణలు చేపడుతున్నారు. అలాగే ఇంటర్మీడియట్ స్థాయి ఒకేషనల్ కోర్సులు, విదేశాల్లో ఉపాధి అవకాశాలను కల్పించే తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ కూడా ఈ వ్యవస్థలో భాగం కానుంది.

ఈ మార్పుల వల్ల కోర్సుల రూపకల్పనలో పరిశ్రమల అవసరాలకు అధిక ప్రాధాన్యం లభించనుంది. విద్యార్థులు నేర్చుకునే నైపుణ్యాలు నేరుగా ఉద్యోగ అవకాశాలకు అనుసంధానం అయ్యేలా సిలబస్ రూపొందించబడుతుంది. దీని ద్వారా యువతకు దేశీయంగా, అంతర్జాతీయంగా ఉపాధి అవకాశాలు విస్తరించే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది ఆగస్టులో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో తాత్కాలికంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఈ వర్సిటీకి, ఫ్యూచర్ సిటీలో 58 ఎకరాల్లో శాశ్వత క్యాంపస్ నిర్మాణం కొనసాగుతోంది. ఈ విలీన ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు ఏడాది సమయం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంస్కరణలతో తెలంగాణ యువత అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను సొంతం చేసుకునే అవకాశాలు పెరుగుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# వేసవిలో సాఫ్ట్ డ్రింక్స్ మోజు ఆరోగ్యంపై ముప్పు

- తీపి పానీయాల వినియోగం పెరుగుతోంది
- దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతున్న అలవాటు
- ప్రత్యామ్నాయంగా సహజ పానీయాల వైపు మళ్లాలి



**డెస్క్, మార్చి 22 తరంగాలు ::** వేసవి కాలం ప్రారంభమైతే చల్లని పానీయాలపై ప్రజల్లో ఆకర్షణ పెరుగుతుంది. ముఖ్యంగా గ్యాస్ కలిగిన తీపి సాఫ్ట్ డ్రింక్స్ తాగడం ద్వారా వెంటనే దాహం తగ్గిన భావన కలుగుతుంది. దీంతో ఈ కాలంలో వాటి వినియోగం గణనీయంగా పెరుగుతోంది. అయితే వీటిలో అధిక చక్కెర, కెఫీన్ ఉండటం వల్ల ఇవి అలవాటుగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాఫ్ట్ డ్రింక్స్‌లో అధిక ఫ్రక్టోజ్ ఉండటం వల్ల శరీరంలో ఇన్సులిన్ నిరోధకత పెరుగుతుంది. ఇది టైప్-2 మధుమేహానికి ముందస్తు సూచనగా పరిగణించబడుతోంది. అదనంగా, అధిక చక్కెర లివర్‌లో కొవ్వుగా మారి నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ సమస్యకు దారితీస్తుంది. దంతాలపై కూడా వీటి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. సోడాలో ఉండే యాసిడ్లు దంతాల పైపొరను దెబ్బతీసి పళ్ల పాడుకు కారణమవుతాయి. అలాగే కాల్షియం శోషణ తగ్గి ఎముకలు బలహీనపడే ప్రమాదం ఉంది. ఇవి కేవలం ఖాళీ కాలరీలను మాత్రమే అందిస్తాయి. పోషక విలువలు లేకపోవడంతో శరీరానికి అవసరమైన పోషకాలు అందవు. లిక్విడ్ కాలరీలు తృప్తిని ఇవ్వకపోవడంతో మరింత ఆహారం తీసుకునే అవకాశం పెరుగుతుంది. దీని ఫలితంగా బరువు పెరగడం, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కెఫీన్ అధికంగా ఉండటం వల్ల గుండె వేగం పెరగడం, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి. అలాగే ఇవి డీహైడ్రేషన్‌కు దారితీసి శరీరంలోని నీటి శాతం తగ్గించవచ్చు. సాఫ్ట్ డ్రింక్స్‌కు బదులుగా ఆరోగ్యకరమైన పానీయాలను తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. సాధారణ నీరు, నిమ్మరసం, కొబ్బరి నీరు, హెర్బల్ టీలు వంటి పానీయాలు శరీరాన్ని చల్లబరచడంలో సహాయపడతాయి. అలాగే శికంజీ, ఛాస్, సత్తు పానీయం, ఆమ్ పన్నా, కోకుమ్ శర్బత్, బెల్ శర్బత్ వంటి సంప్రదాయ పానీయాలు కూడా మంచి ప్రత్యామ్నాయాలు. పండ్లు, కూరగాయలతో తయారు చేసే స్మూతీలు పోషకాలను అందించి తృప్తిని ఇస్తాయి. కాబట్టి వేసవిలో దాహం తీర్చుకోవడానికి సాఫ్ట్ డ్రింక్స్‌ను తగ్గించి ఆరోగ్యకరమైన పానీయాలను ఎంచుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# బంజారాహిల్స్‌లో ఉద్రిక్తత

- ఎంపీ సి.ఎం. రమేష్ హల్చల్
- వివాదాస్పద స్థలంలో ఉదయం ఉద్రిక్త పరిస్థితి
- ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వెనుక ఘటన
- పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వివాదం



**హైదరాబాద్, మార్చి 22 తరంగాలు :** హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ వెనుక ఉన్న ఆనంద్ ప్రభాత్ సొసైటీకి చెందిన వివాదాస్పద స్థలంలో బీజేపీ ఎంపీ సి.ఎం. రమేష్ ఉదయం సమయంలో హల్చల్ చేశారు. ఉదయం పూటనే వివాదాస్పద స్థలం వద్దకు చేరుకున్న ఎంపీ సి.ఎం. రమేష్ అక్కడ పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. స్థలంపై హక్కుల విషయంలో ఇరుపక్షాల మధ్య ఉద్రిక్తతలు పెరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం ఈ వివాదం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఇరువర్గాల వాదనలు విన్న పోలీసులు తదుపరి చర్యలు చేపడుతున్నారు. ఈ ఘటనతో ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా, పరిస్థితిని పోలీసులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

# పేదింటి ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్






- పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**పర్వతగిరి,22మార్చి, తరంగాలు :** ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పేదలకు పెన్నిదని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కే ఆర్ నాగరాజు అన్నారు. నేడు పర్వతగిరి మండలానికి సంబంధించిన 83 మంది లబ్ధిదారులకు రూ.83,09,628 (83 లక్షల 9 వేల 628) విలువ గల కళ్యాణలక్ష్మి, షాధీ ముబారక్ చెక్కులను పర్వతగిరి మండల కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయం నందు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఇందిరమ్మ ఇల్లుకు ముగ్గు పోసి నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీగా ఎంపీడీవో కార్యాలయం విచ్చేసి చెక్కులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఈ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తూ ఆపన్న హస్తం అందిస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కళ్యాణలక్ష్మి పథకంలో భాగంగా నూతన వధూవరులకు ఆర్థిక సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ పథకం ప్రారంభించబడిందని అన్నారు.పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని, రాష్ట్రంలో పేదలకు నూతన రేషన్ కార్డు అందజేసి రేషన్ కార్డుదారులందరికీ ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, ఆడబిడ్డల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటూ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. మహిళా సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజల్లో మంచి పేరు సంపాదించుకోవాలని, రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటామని, తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలిపించిన పర్వతగిరి మండల ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని, వర్ధన్నపేట నియోజకవర్గంలో విద్య, వైద్య రంగంపై ప్రత్యేక ఫోకస్ పెట్టి ముందుకు వెళు_న్నామని, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను తెలియజేయాలని, అర్హులైన పేద ప్రజలందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందజేస్తామని, గతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని డబ్బులు వసూలు చేసిన చరిత్ర ఉందని, ప్రస్తుతం ఒక్క రూపాయి లేకుండా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఇందిరా మహిళ విషయంలో డబ్బులు తీసుకున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని పార్టీ నేతలను ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో ఎవరికీ ఒక రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని, పారదర్శకంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.అనంతరం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న మోడల్ హౌస్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో వెంకట స్వామి, ఎంపీవో శేషు, మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, సర్పంచులు చిదురు శంకర్, మంజుల, గాడిపెల్లి మహేందర్, నరేష్, కనకయ్య, శ్రీనివాస్, మూడు లక్ పతి, కిషన్ నాయక్, శ్రీనివాస్, గాడుల రమేష్, విజయలక్ష్మి, డెక్క సునీత, విజయ, ఉపసర్పంచ్ రాజు, దూడల మల్లన్న చైర్మన్ కారింగుల రాము, తో పాటు తదితరులు పాల్గొన్నారు.





## కలబందతో చర్మం, జుట్టుకు సహజ సంరక్షణ అందం, ఆరోగ్యం రెండూ మీవే

- సహజ ఔషధంగా కలబంద ప్రాధాన్యం
- ముఖం, జుట్టుకు ఉపయోగించే విధానాలు
- నియమిత వినియోగంతో మెరుగైన ఫలితాలు



**డెస్క్, మార్చి 22 తరంగాలు :** చర్మం, జుట్టు సంరక్షణలో సహజ పదార్థాలకు మళ్లీ ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ క్రమంలో కలబంద ఒక అద్భుతమైన సహజ ఔషధంగా నిలుస్తోంది. మొటిమలు, మచ్చలు తగ్గించడం నుండి జుట్టుకు తేమను అందించడం వరకు అనేక ప్రయోజనాలు కలబందలో ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే అనేక సౌందర్య ఉత్పత్తుల్లో కూడా దీన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. కలబందలో విటమిన్లు ఎ, సి, ఈతో పాటు ఖనిజాలు, ఎంజైమ్‌లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా మార్చడమే కాకుండా, జుట్టును బలంగా, మెరిసేలా ఉంచడంలో సహాయపడతాయి. వారానికి ఒకసారి కలబందను ఉపయోగించడం ద్వారా పొడిబారిన చర్మం, జుట్టు సమస్యలు తగ్గుతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఇది జుట్టుకు తేమను అందించి చిక్కుబడకుండా చేస్తుంది. కలబందను ఉపయోగించడానికి ముందుగా ఆకులోని పచ్చటి పొరను తొలగించి లోపల ఉన్న గుజ్జును తీసుకోవాలి. ఈ జెల్‌ను ముఖానికి అప్లై చేసి సుమారు 30 నిమిషాల తర్వాత కడిగితే మొటిమలు, మచ్చలు తగ్గడమే కాకుండా చర్మం మృదువుగా మారుతుంది. తేనె లేదా పసుపు కలిపి ఫేస్ మాస్క్‌గా ఉపయోగిస్తే చర్మంలో వాపు తగ్గి సహజ కాంతి పెరుగుతుంది. రాత్రిపూట నేరుగా అప్లై చేస్తే చర్మం మరింత సాఫ్ట్‌గా మారుతుంది.

జుట్టు సంరక్షణలో కూడా కలబంద కీలక పాత్ర పోషిస్తుంది. కలబంద జెల్‌ను కొబ్బరి నూనె లేదా ఆముదంతో కలిపి హెయిర్ మాస్క్‌గా ఉపయోగిస్తే జుట్టు లోతుగా కండిషన్ అవుతుంది. ఇది చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలను తగ్గించి జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. తల చర్మాన్ని శాంతపరచడం, జుట్టును దృఢపరచడం వంటి ప్రయోజనాలు కూడా కలబందలో ఉన్నాయి. అయితే ఏదైనా చర్మ సమస్యలు ఉంటే వైద్యుల సలహా తీసుకుని ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.


## వేసవిలో నడక ఆరోగ్యాన్ని కాపాడే సరైన సమయం

- ఎండ తీవ్రతలో నడకపై ప్రభావం
- ఉదయం, సాయంత్రం సమయాల ప్రాధాన్యం
- జాగ్రత్తలు పాటిస్తేనే పూర్తి ప్రయోజనం




**డెస్క్, మార్చి 22 తరంగాలు :** నడక ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సులభమైన వ్యాయామం. రోజుకు 10 వేల అడుగులు నడవాలని లక్ష్యంగా పెట్టుకునే వారు రోజురోజుకు పెరుగుతున్నారు. అయితే వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఈ లక్ష్యాన్ని సాధించడం కష్టతరం చేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికి మించి నమోదవుతుండటంతో పాటు వేడి గాలులు తీవ్రంగా వీచుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 38 నుండి 40 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. దీంతో బయట నడకకు వెళ్లే వారికి ఆరోగ్యపరమైన ప్రమాదాలు పెరుగుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవిలో నడకకు సరైన సమయం ఎంచుకోవడం చాలా ముఖ్యం. ఉదయం 5 గంటల నుండి 7 గంటల మధ్య లేదా సాయంత్రం 6 నుండి 8 గంటల మధ్య నడవడం ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటంతో డీహైడ్రేషన్, వడదెబ్బ వంటి సమస్యలు తగ్గుతాయి. ఉదయం గాలి తాజాగా ఉండటం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు నడవడం ప్రమాదకరమని, ఈ సమయంలో సూర్య కిరణాల తీవ్రత అధికంగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నడకను మొదట 20 నుండి 30 నిమిషాలతో ప్రారంభించి, క్రమంగా 60 నిమిషాలకు పెంచుకోవడం మంచిదని సూచిస్తున్నారు. వేసవిలో నడక సమయంలో కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. ముందుగా నీరు ఎక్కువగా తాగడం అత్యంత ముఖ్యము. నడకకు ముందు, మధ్యలో, తర్వాత కూడా తగినంత నీరు తీసుకోవాలి. అవసరమైతే ఎలక్ట్రోలైట్ పానీయాలు కూడా తీసుకోవచ్చు. డీహైడ్రేషన్‌ను పెంచే కాఫీ, మద్యం వంటి పానీయాలను తగ్గించడం మంచిది. అలాగే సూర్యరశ్మి నుంచి రక్షణ కోసం సన్‌స్క్రీన్, టోపీ, సన్‌గ్లాసెస్ ఉపయోగించడం అవసరం. తేలికపాటి, గాలి సులభంగా చేరే దుస్తులు ధరించడం ద్వారా వేడి ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. ఇంకా చెట్లు ఎక్కువగా ఉన్న ప్రదేశాలు, పార్కులు వంటి నీడ కలిగిన ప్రాంతాల్లో నడవడం ఉత్తమం. నడుస్తున్నప్పుడు తలనొప్పి, వాంతులు, అలసట, గందరగోళం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆపి విశ్రాంతి తీసుకోవాలి. చిన్న స్థాయి డీహైడ్రేషన్ కూడా శరీరంపై ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి వేసవిలో నడక చేయాలంటే సరైన సమయాన్ని ఎంచుకోవడం, తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# వేసవిలో ఆరోగ్యానికి సహజ రక్షకుడు




- ఫ్రిజ్ నీటికి బదులుగా సంప్రదాయ ఎంపిక
- సహజ వడపోతతో శుభ్రమైన నీరు
- శరీరానికి చల్లదనం, శక్తి అందించే పానీయం

**డెస్క్, మార్చి 22 తరంగాలు :** వేసవి కాలం ప్రారంభమయ్యే సరికి ఎండల తీవ్రత పెరిగి శరీరానికి నీటి అవసరం అధికమవుతుంది. ఈ సమయంలో చాలామంది ఫ్రిజ్‌లోని చల్లటి నీటిని తాగేందుకు ఆసక్తి చూపుతారు. అయితే అతిగా చల్లటి నీరు తాగడం వల్ల గొంతు నొప్పి, జలుబు వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా పూర్వకాలం నుంచి ఉపయోగిస్తున్న మట్టి కుండ నీరు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. మట్టి కుండలో ఉండే సూక్ష్మ రంధ్రాలు నీటిని సహజంగా వడపోస్తాయి. ఈ ప్రక్రియలో నీటిలోని మలినాలు తగ్గి, హానికర బ్యాక్టీరియా నియంత్రణలో ఉంటుంది. ఫ్రిజ్ నీటిలా అత్యంత చల్లగా కాకుండా, కుండ నీరు సహజ ఉష్ణోగ్రతకు అనుగుణంగా చల్లబడుతుంది. అందువల్ల గొంతు సమస్యలు, శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. దీనివల్ల శరీరం సులభంగా ఈ నీటిని స్వీకరిస్తుంది. మట్టి కుండ నీరు తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తగ్గుతాయి. వేసవిలో ఎండల వల్ల తగ్గిపోయే శక్తిని తిరిగి పొందడంలో ఇది సహాయపడుతుంది. అలాగే శరీరంలోని గ్లూకోజ్ స్థాయిలను సమతుల్యం చేయడంలో కూడా ఇది ఉపయోగకరంగా ఉంటుంది. మట్టిలో ఉండే ఖనిజాలు నీటిలో కలవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. వేసవిలో చెమట వల్ల వచ్చే చర్మ సమస్యలను తగ్గించడంలో కూడా కుండ నీరు సహకరిస్తుంది. శరీరంలో నీటి శాతం సమతుల్యం కావడం వల్ల అలసట తగ్గి ఉత్సాహం పెరుగుతుంది. కాబట్టి వేసవిలో ఫ్రిజ్ నీటి కంటే మట్టి కుండ నీటిని తాగడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.



## (బిజినెస్) ఆన్‌లైన్ చెల్లింపులకు కొత్త నిబంధనలు.. జాగ్రత్తగా ఉండండి




**హైదరాబాద్, మార్చి 22 తరంగాలు :** దేశంలో పెరుగుతున్న సైబర్ మోసాలకు చెక్ పెట్టేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్ లావాదేవీల భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తూ కొత్త నిబంధనలు తీసుకురాగా, ఇవి ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఈ కొత్త నియమాల ప్రకారం ఇకపై ప్రతి డిజిటల్ లావాదేవీకి టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ తప్పనిసరి కానుంది. అంటే ఒక్క పాస్‌వర్డ్ లేదా ఓటీపీతో సరిపోదు.. కనీసం రెండు దశల్లో ధృవీకరణ పూర్తిచేయాల్సి ఉంటుంది.బ్యాంకులు, కార్డు నెట్‌వర్క్‌లు, ఫిన్‌టెక్ సంస్థలకు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసిన ఆర్బీఐ.. పాస్‌వర్డ్, పిన్, ఓటీపీ, ఫింగర్‌ప్రింట్, ఫేస్ గుర్తింపు వంటి పద్ధతులలో కనీసం రెండు విధానాలు తప్పనిసరిగా ఉపయోగించాలని స్పష్టం చేసింది. ఇందులో ఒకటి డైనమిక్‌గా (ప్రతి లావాదేవీకి మారేది) ఉండాలి.కొత్త నిబంధనల ముఖ్యాంశాలు:లి అన్ని డిజిటల్ లావాదేవీలకు రెండు దశల ధృవీకరణ తప్పనిసరిలి ఒక వెరిఫికేషన్ డైనమిక్‌గా ఉండాలిలి మోసాలు జరిగితే బాధ్యత సంబంధిత సంస్థలపైనే ఉంటుందిలి రిస్క్ ఉన్న లావాదేవీలకు అదనపు తనిఖీలు అవసరంలి అక్టోబర్ 1, 2026 నుంచి అంతర్జాతీయ లావాదేవీలకూ ఇదే విధానం అమలుఇటీవల యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపు విధానాలు విస్తరించడంతో పాటు, ఫిషింగ్, సిమ్ స్వాప్, మాల్వేర్ దాడులు కూడా పెరిగాయి. ఓటీపీ ఆధారిత వ్యవస్థలో ఉన్న లోపాలను దృష్టిలో ఉంచుకుని ఈ కొత్త భద్రతా వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు నిపుణులు చెబుతున్నారు.ఇకపై ఆన్‌లైన్ పేమెంట్స్ చేసే ప్రతి వినియోగదారు మరింత అప్రమత్తంగా ఉండాలి. కొత్త నిబంధనలతో లావాదేవీలు కొంచెం సమయం తీసుకున్నా, భద్రత మాత్రం గణనీయంగా పెరగనుంది.

## (బిజినెస్)నాలుగు రోజుల్లో బంగారం భారీ పతనం.. ఈరోజు ధరలు ఇవే




**హైదరాబాద్, మార్చి 22 తరంగాలు :** దేశీయ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా నాలుగో రోజూ భారీగా తగ్గుతూ కొనుగోలుదారులకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి. అంతర్జాతీయంగా యుద్ధ పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, ఈసారి బంగారం ధరలు పెరగకుండా పడిపోవడం విశేషం.అమెరికా డాలర్ బలపడటం, అలాగే కేంద్ర బ్యాంకు వడ్డీ రేట్లను తగ్గించకపోవడం వల్ల పెట్టుబడిదారులు బంగారం నుంచి బాండ్ల వైపు మళ్లుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేవలం నాలుగు రోజుల్లోనే తులం బంగారం ధర దాదాపు రూ.12 వేల వరకు తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్లో కూడా స్పాట్ బంగారం ధరలు గణనీయంగా పడిపోయి ఔన్స్‌కు సుమారు 4494 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.హైదరాబాద్ బులియన్ మార్కెట్‌ను పరిశీలిస్తే, 24 క్యారెట్ల బంగారం ధర తులానికి రూ.2,940 తగ్గి రూ.1,45,970కు చేరింది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.2,750 తగ్గి రూ.1,33,800 వద్ద నమోదైంది.బంగారంతో పాటు వెండి ధరల్లో కూడా భారీ పతనం కనిపిస్తోంది. కేవలం నాలుగు రోజుల్లోనే కిలో వెండి ధర రూ.30 వేల వరకు తగ్గింది. ఈరోజు ఒక్కరోజే రూ.10 వేల మేర పడిపోవడంతో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,50,000 వద్ద ఉంది.ధరల్లో ఈ తరహా మార్పులు కొనసాగే అవకాశం ఉన్నందున, కొనుగోలు చేసే ముందు స్థానిక మార్కెట్ ధరలను పరిశీలించడం మంచిదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

## హైదరాబాద్‌లో ఘనంగా 'అరెరే.. అరెరే..'మ్యూజిక్ వీడియో ఆల్బమ్ విడుదల

హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో సింగర్, నటి దియా ప్రతిభను చాటుతూ రూపొందిన 'అరెరే.. అరెరే..' మ్యూజిక్ వీడియో ఆల్బమ్ ఆవిష్కరణ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. బటర్‌ఫ్లై మ్యూజిక్ బ్యానర్‌పై నూతన్ చెకూరి నిర్మించిన ఈ ఆల్బమ్ విడుదల కార్యక్రమానికి తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, యువ హీరో పూరి ఆకాష్, ప్రముఖ సంగీత దర్శకుడు రఘు కుంచె, నటులు సమీర్, సాగర్, మిమిక్రీ శివారెడ్డి వంటి సినీ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై ఆడియోను విడుదల చేశారు.ఈ సందర్భంగా వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ దియాలోని బహుముఖ ప్రజ్ఞను కొనియాడారు, ఆమె గాత్రం మరియు నటన రెండూ అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. రఘు కుంచె మాట్లాడుతూ డిజిటల్ యుగంలో ప్రతిభ ఉంటే అవకాశాలు వాటంతట అవే వస్తాయని, దియా భావ వ్యక్తీకరణ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో దియాతో కలిసి నటించిన పూరి ఆకాష్ ఆమె గాన ప్రతిభను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ, యువ కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. మిమిక్రీ శివారెడ్డి, నిర్మాత నూతన్ చెకూరి తదితరులు దియా కృషిని అభినందిస్తూ ఈ ఆల్బమ్ పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## (బిజినెస్) టాటా క్యాపిటల్‌కు భారీ పన్ను నోటీసు




**ముంబై, మార్చి 22 తరంగాలు :** ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ టాటా క్యాపిటల్కు ఆదాయపు పన్ను శాఖ నుంచి భారీ డిమాండ్ నోటీసు అందింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రీఅసెస్మెంట్ ప్రక్రియలో భాగంగా ముంబై పన్నుల అధికారులు రూ.413.18 కోట్ల డిమాండ్‌ను జారీ చేశారు. అయితే ఈ డిమాండ్‌లో గణన దోషాలు ఉన్నాయని సంస్థ స్పష్టం చేసింది.ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 143(3)తో పాటు సెక్షన్ 147 ప్రకారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు కంపెనీ తెలిపింది. 2026 మార్చి 20న ఈ ఆర్డర్ జారీ కాగా, మరుసటి రోజు దానిని డౌన్‌లోడ్ చేసుకున్నట్లు వెల్లడించింది. మొత్తం డిమాండ్‌లో రూ.202.72 కోట్ల వడ్డీ కూడా చేర్చినట్లు సమాచారం.ఈ రీఅసెస్మెంట్ అసలు టాటా క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్కు సంబంధించినదిగా సంస్థ పేర్కొంది. ఈ సంస్థ 2023 ఏప్రిల్ 1న టాటా క్యాపిటల్‌లో విలీనమైంది. గతంలో టీసీఎఫ్ఎస్ఎల్ టీడీఎస్, టీసీఎస్, అడ్వాన్స్ ట్యాక్స్ రూపంలో రూ.225.89 కోట్లు చెల్లించిందని, కానీ అసెసింగ్ అధికారి కేవలం రూ.16.36 కోట్లను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారని వివరించింది.దీంతో రూ.209.52 కోట్ల మేర ట్యాక్స్ క్రెడిట్ లోపం ఏర్పడిందని, దానిపై పొరపాటున భారీ వడ్డీ కూడా లెక్కించారని సంస్థ తెలిపింది. ఈ లెక్కలు పూర్తిగా తప్పు అని, చట్టపరంగా ఈ డిమాండ్ నిలబడదని టాటా క్యాపిటల్ ధీమా వ్యక్తం చేసింది.ఈ నేపథ్యంలో గణనలోని లోపాలను సరిదిద్దాలని కోరుతూ రెక్టిఫికేషన్ అప్పీల్ దాఖలు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ పరిణామం వల్ల సంస్థ ఆర్థిక కార్యకలాపాలపై ఎలాంటి తక్షణ ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది.

## పేదల భూములు గుంజుకుంటే ఊరుకోము





- కోహెడ భూముల వివాదంపై ఈటల ఆగ్రహం
- భూ బాధితుల ధర్నాకు మద్దతు
- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- పరిహారం ఇవ్వాలని డిమాండ్
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

మల్కాజిగిరి, మార్చి 22 (తరంగాలు ప్రతినిధి): కోహెడ గ్రామ భూముల వివాదం నేపథ్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. భూ బాధితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు మద్దతు తెలిపిన ఆయన, పేదల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలు నాలుగు తరాలుగా సాగు చేస్తున్న భూములను ప్రభుత్వం గుంజుకోవడం అన్యాయమని అన్నారు. కోహెడ గ్రామంలో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వారికి గతంలోనే పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. 12 సంవత్సరాలకు పైగా భూమిని సాగు చేస్తున్న వారిపై హక్కు ఉంటుందని, అలాంటి భూములను స్వాధీనం చేసుకునే అధికారం ఎవరికీ లేదని స్పష్టం చేశారు.

అసైన్డ్ భూముల విషయంలో కూడా ప్రభుత్వం న్యాయం చేయాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. రింగ్ రోడ్ నిర్మాణ సమయంలో పేదల భూములకు పరిహారం ఇచ్చినట్లే, ఇప్పుడు కూడా అదే విధంగా పరిహారం చెల్లించాలని కోరారు. గతంలో భూములు తీసుకుని సరైన పరిహారం ఇవ్వకుండా రైతులను మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధానాన్ని కొనసాగిస్తోందని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. అధికారం ఉందని పేదలపై దౌర్జన్యం చేస్తే ప్రజలు సహించరని హెచ్చరించారు. పేదల జీవనాధారాన్ని నాశనం చేయడం ప్రభుత్వ ధర్మం కాదని ప్రశ్నించారు.కోహెడలో 159 మంది రైతులు సాగు చేస్తున్న సుమారు 239 ఎకరాల భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ భూముల విషయంలో రైతులతో చర్చలు జరపకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. రైతులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తీసుకుని పరిష్కారం చూపాలని సూచించారు. పోలీసులు పేదలపై దౌర్జన్యం చేయకూడదని హెచ్చరించిన ఈటల రాజేందర్, వారు ప్రజల రక్షణ కోసం పనిచేయాలని అన్నారు. పెద్దల ఆదేశాలతో పేదలపై చర్యలు తీసుకుంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కోహెడ భూముల సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని, పేదలకు సరైన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్య పరిష్కారం కోసం అవసరమైతే భారతీయ జనతా పార్టీ పూర్తి స్థాయిలో ఉద్యమం చేపడుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. పేదలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు, అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం





- పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తాం
- పర్వతగిరి దేవిలాల్ తండా లోఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు పోసే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

**వర్ధన్నపేట ప్రతినిధి,22 మార్చి, తరంగాలు :** అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు అన్నారు.వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం పరిధిలోని పర్వతగిరి గ్రామ పంచాయతీ పరిధిలో దేవిలాల్ తండాకి చెందిన ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు లావుడ్య మంగమ్మ - రాములు ఇంటి నిర్మాణం కోస ముగ్గుపోసే కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొని కొబ్బరికాయ కొట్టి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.నిర్ణీత కాల వ్యవధిలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకోవాలని తెలియజేశారు.ఇందిరమ్మ ఇండ్లు కట్టుకో లేని వారి కోసం ఒక కంపెనీ తో మాట్లాడను ఇండ్లు మంజూరైన ప్రతి ఒకరు ఇండ్లు కట్టుకొని సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని ఎమ్మెల్యే నాగరాజు సూచనలు చేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. లబ్ధిదారులకు విడుదలవారీగా రూ 5లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు.అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు.ఉచిత ఇసుకను పంపిణీ చేస్తామని అన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వద్దని, ఎవరైనా తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు లేని గ్రామాలు లేవని, పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మహిళా సంఘాల ద్వారా రుణాలు తీసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇండ్లను నిర్మించుకోవాలని తెలిపారు..ఈ కార్యక్రమంలో పర్వతగిరి గ్రామ సర్పంచ్ చిదురు శంకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కూసం రామచందర్, మండల పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
సోమవారం, 23 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## మూసీ నదీ పునరుజ్జీవనం - పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ వన్నాల వెంకటరమణ



**హైదరాబాద్, మార్చి 22,తరంగాలు :** హైదరాబాద్ లోని సోమాజిగూడ లోని హోటల్ కత్రియాలో మూసీ నదీ పునరుజ్జీవనం – పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు,మహారాష్ట్ర జల విధానం నిర్వహణ మరియు ముఖ్య మంత్రి సలహాదారు శ్రీరామ్ వేదిరే పాల్గొన్నారు. వీరితో పాటు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ పాల్గొన్నారు.అనంతరం వక్తలు మాట్లాడుతూ : మూసీ నది మనందరిది --- మూసీ నదీ పునరుజ్జీవనానికి సంబంధించిన పర్యావరణ, మౌలిక సదుపాయాల, సామాజిక విధానాలను పరిశీలించడానికి, నిజాయితీతో కూడిన, విజ్ఞానవంతమైన చర్చ జరిపారు. ప్రపంచవ్యాప్త ఉదాహరణలు మరియు స్థానిక వాస్తవ పరిస్థితుల ఆధారంగా, ప్రభుత్వం ప్రకటించిన దానికి, వాస్తవంగా జరగాల్సిన దానికి మధ్య ఉన్న అంతరాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చూపెట్టడం జరిగింది.
బీజేపీ పార్టీ ముసి నది పునరుజ్జీవననికి ఎట్టి పరిస్థితుల్లో వ్యతిరేకం కాదు, కానీ దాని విధి విధానాలు మాత్రం పద్ధతి ప్రకారం జరిగితే, దాని వలన నిరుపేద వర్గానికి న్యాయం జరిగితే బీజేపీ పార్టీ కి ఏమాత్రం అభ్యంతరం లేదు అని అన్నారు.



## సిద్దిపేట రైతు సదస్సుకు తరలి వెళ్ళిన పర్వతగిరి రైతులు,మహిళలు




**పర్వతగిరి, మార్చ్ 22,తరంగాలు** : రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ అభివృద్ధి ద్యేయంగా సిద్దిపేట జిల్లాలోని నర్మెట గ్రామంలో గల ఆయిల్ ఫామ్ కర్మాగారంలో నాలుగు రోజులపాటు నిర్వహించ తలపెట్టిన రైతు సదస్సుకు ఆదివారం పర్వతగిరి మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో రైతులు మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించే ఈ రైతు సదస్సుకు మండలంలోని కొంకపాక, చౌటపల్లి, పర్వతగిరి, ఏనుగల్, కల్లెడ, వడ్లకొండ, గ్రామాల నుండి హార్టికల్చర్, వ్యవసాయ, మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు తరలి వెళ్లారు. చౌటపల్లిలో స్థానిక సర్పంచ్ మట్టపల్లి వెంకటేశ్వరరావు, సెర్ప్ సీసీ గోలి కొమురయ్య ఏ ఈ ఓ రాజేష్, జెండా ఊపి బస్సు ప్రారంభించగా, ఏనుగల్లులో సర్పంచ్ తొర్రి పద్మ టెంకాయ కొట్టి ప్రారంభించారు. అలాగే మిగతా గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రముఖులు వ్యవసాయ శాఖ, సెర్ప్ ఉద్యోగులు జెండా ఊపి ప్రారంభించగా, రైతు సదస్సుకు ఆయా గ్రామాల సెర్ప్ సీసీలు వర్గాల సుధాకర్, పరకాల శామ్సన్, దేవేంద్ర వ్యవసాయ విస్తీర్ణ అధికారులు (ఏఈవోలు) వివో ప్రతినిధులు, వివోఏలు రైతులు, స్వయం సహాయక బృందాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్)ఆర్థిక పురోగతి మరియు సవాళ్ల విశ్లేషణ

- రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు, ప్రాధాన్యతలు
- ఎరుగుతున్న ప్రజా రుణం, ఆర్థిక సవాళ్లు
- జిల్లా స్థాయి అభివృద్ధిపై కేంద్రీకరించాల్సిన అవసరం




**డెస్క్, మార్చి 22 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 3.24 లక్షల కోట్ల భారీ బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్తుకు ఒక కీలకమైన దిక్సూచిగా నిలుస్తోంది. గత పదేళ్లుగా రాష్ట్రం సాధించిన ప్రగతిని కొనసాగిస్తూనే భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నిధుల కేటాయింపులు చేయడం ఈ బడ్జెట్ లోని ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విద్యా మరియు సాగునీటి రంగాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్దపీట వేయడం హర్షించదగ్గ విషయం. బడ్జెట్ కేటాయింపుల సరళిని నిశితంగా గమనిస్తే ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు మరియు సంక్షేమ పథకాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. అయితే ఈ భారీ నిధుల వినియోగం క్షేత్రస్థాయిలో ఎంతవరకు పారదర్శకంగా జరుగుతుందనేది ఇప్పుడు అందరి ముందున్న అతిపెద్ద ప్రశ్న. బడ్జెట్ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా సామాన్యుడి దరికి చేరినప్పుడే దానికి నిజమైన సార్థకత లభిస్తుంది.

మరోవైపు రాష్ట్ర అప్పులు రూ. 6 లక్షల కోట్లకు చేరువవుతుండటం ఆర్థిక నిపుణులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రతి ఏటా పెరుగుతున్న వడ్డీల భారం రాష్ట్ర ఖజానాపై ఊహించని ఒత్తిడిని పెంచుతోంది. కేవలం కొత్త అప్పుల ద్వారానే పాత అప్పులను తీర్చడం లేదా సంక్షేమ పథకాలను నిర్వహించడం దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారవచ్చు. ప్రభుత్వం తన సొంత ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు అనవసర ఖర్చులను నియంత్రించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుల ఊబి నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించే మార్గాలను అన్వేషించడంతో పాటు ధనిక రాష్ట్రంగా పేరున్న తెలంగాణ తన పరపతిని కాపాడుకోవాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన వాటా మరియు గ్రాంట్ల విషయంలో మరింత గట్టిగా పోరాడి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటం తక్షణ కర్తవ్యం. అభివృద్ధి మొత్తం కేవలం హైదరాబాద్ మరియు దాని చుట్టుపక్కల ప్రాంతాలకే పరిమితం కావడం వల్ల ప్రాంతీయ అసమానతలు పెరిగే అవకాశం ఉంది. ఐటీ పరిశ్రమలు మరియు భారీ తయారీ రంగాలు కేవలం భాగ్యనగరానికే పరిమితం కాకుండా వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాలకు కూడా విస్తరించాలి. జిల్లాల్లోని యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు లభించినప్పుడే హైదరాబాద్ పై ఒత్తిడి తగ్గుతుంది మరియు వలసలను నిరోధించవచ్చు. బడ్జెట్ కేటాయింపుల్లో జిల్లాల వారీగా సమతుల్యత పాటించడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా సమాంతర అభివృద్ధి సాధ్యమవుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రభుత్వం మరింత పకడ్బందీగా దృష్టి పెట్టాలి. అప్పుడే పల్లెలు ప్రగతి పథంలో పయనించి రాష్ట్ర ఆదాయానికి తోడ్పడతాయి.

సాగునీటి ప్రాజెక్టుల పూర్తి మరియు వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలి. రైతులు ఎదుర్కొంటున్న విత్తనాల కొరత మరియు మద్దతు ధర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం ప్రభుత్వ బాధ్యత. ఉచిత పథకాల కంటే స్వయం ఉపాధిని ప్రోత్సహించే పథకాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరుతాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడం ద్వారా నిరుద్యోగ సమస్యను కొంతవరకు అరికట్టవచ్చు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం మరియు మౌలిక వసతుల కల్పన దిశగా వేగంగా అడుగులు వేయాలి. ఉన్నత చదువులు చదివిన యువతకు సరైన వేదికలు కల్పించి వారి మేధస్సును రాష్ట్ర అభివృద్ధికి వినియోగించుకోవాలి.

పర్యావరణ పరిరక్షణ మరియు పట్టణ ప్రాంతాల్లో కాలుష్య నియంత్రణపై కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మూసీ నది ప్రక్షాళన మరియు నగరాల్లో పచ్చదనం పెంచే ప్రాజెక్టులు కేవలం నిధుల ఖర్చుకే పరిమితం కాకుండా వాస్తవ రూపం దాల్చాలి. పెరుగుతున్న పట్టణీకరణ వల్ల తలెత్తుతున్న ట్రాఫిక్ మరియు మురుగునీటి సమస్యలను పరిష్కరించడానికి ముందస్తు ప్రణాళికలు అవసరం. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగడమే కాకుండా ఆర్థిక క్రమశిక్షణ పాటించడం ప్రభుత్వ ప్రాథమిక ధర్మం. సంపదను సృష్టించి ప్రజలకు పంచడం అనే సూత్రం ప్రకారం ముందుకు సాగాలి. అప్పుల భారం లేని మరియు స్వయం సమృద్ధి కలిగిన తెలంగాణను నిర్మించడం కోసం పాలకుల నుంచి ప్రజల వరకు అందరూ బాధ్యతగా వ్యవహరించాలి. రాష్ట్రంలోని పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసేందుకు కొత్త పారిశ్రామిక విధానాలను మరింత సరళతరం చేయాలి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా స్థానిక చిన్నతరహా పరిశ్రమలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలి. కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఆధునిక యంత్రాల వినియోగంపై శిక్షణ ఇవ్వడం వల్ల వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ముఖ్యంగా మహిళా సాధికారత కోసం కేటాయించిన నిధులు వారిని పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు ఉపయోగపడాలి. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం ద్వారా గ్రామీణ మహిళల ఆదాయం పెరుగుతుంది. పారిశ్రామిక ప్రగతి కేవలం నగరాలకే పరిమితం కాకుండా మారుమూల ప్రాంతాలకు చేరినప్పుడే సమసమాజ నిర్మాణం జరుగుతుంది.

ఆరోగ్య రంగంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమైనప్పటికీ, మారుమూల ప్రాంతాల్లో వైద్య సౌకర్యాలు ఇంకా మెరుగుపడాలి. జిల్లా ఆసుపత్రుల్లో అధునాతన పరికరాలు మరియు సరిపడా వైద్య సిబ్బందిని నియమించడం ద్వారా పేదలకు ఖరీదైన వైద్యం అందుబాటులోకి వస్తుంది. ఆరోగ్య శ్రీ వంటి పథకాల పరిధిని పెంచి మరిన్ని ప్రాణాంతక వ్యాధులను చేర్చాల్సిన అవసరం ఉంది. కేవలం భవనాల నిర్మాణం మాత్రమే కాకుండా నాణ్యమైన చికిత్స అందించడంపై దృష్టి పెట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడం ద్వారా గర్భిణీలు మరియు శిశువుల మరణాలను నివారించవచ్చు. ప్రతి పౌరుడికి మెరుగైన ఆరోగ్యం అందించడం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలి. రవాణా మరియు కమ్యూనికేషన్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ద్వారా వాణిజ్యం వేగవంతం అవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జాతీయ రహదారుల అనుసంధానంతో పాటు గ్రామీణ రోడ్ల మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. డిజిటల్ తెలంగాణలో భాగంగా ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడం వల్ల విద్య మరియు పాలనలో పారదర్శకత పెరుగుతుంది. ప్రజా రవాణా వ్యవస్థను ముఖ్యంగా ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు అవసరమైన రాయితీలు మరియు కొత్త బస్సుల కొనుగోలు చేపట్టాలి. పర్యాటక రంగం అభివృద్ధికి తెలంగాణలోని చారిత్రక కట్టడాలు మరియు ప్రకృతి అందాలను ప్రపంచానికి చాటి చెప్పాలి. రవాణా సౌకర్యాల మెరుగుదల ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిది కాబట్టి దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని అరికట్టి పారదర్శకమైన పాలన అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ప్రతి రూపాయి సక్రమంగా వినియోగించబడుతుందో లేదో పర్యవేక్షించేందుకు పటిష్టమైన నిఘా వ్యవస్థ ఉం• డాలి. సాంకేతికతను వినియోగించుకుని ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు చేర్చాలి. భూ రికార్డుల ప్రక్షాళన మరియు ధరణి వంటి పోర్టల్స్ లో ఉన్న లోపాలను సరిదిద్ది రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. పరిపాలన వికేంద్రీకరణ ఫలితాలు సామాన్యులకు అందేలా చర్యలు తీసుకోవాలి. ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేసి నిరుద్యోగుల ఆశలను నెరవేర్చాలి. నిజాయితీతో కూడిన పాలన మాత్రమే రాష్ట్ర అభివృద్ధికి పునాది వేస్తుంది. రాబోయే ఐదేళ్ల కాలంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టేందుకు సమష్టి కృషి అవసరం. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ ఏకతాటిపైకి రావాలి. వనరుల సద్వినియోగం మరియు మానవ వనరుల నైపుణ్యం కలగలిస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూనే పారిశ్రామిక వృద్ధిని సాధించడం ఒక సవాలుగా ఉన్నప్పటికీ దానిని సమర్థవంతంగా ఎదుర్కోవాలి. భవిష్యత్ తరాలకు అప్పుల భారంతో కూడిన రాష్ట్రాన్ని కాకుండా అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని అందించడం మనందరి బాధ్యత. బడ్జెట్ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసి తెలంగాణ కీర్తిని దశదిశలా వ్యాపింపజేయాలి. ఈ ఆకాంక్ష నెరవేరినప్పుడే ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు ఒక అర్థం ఉంటుంది.

# వైద్యం వ్యాపారం కాదు, మానవ సేవ

- మెగా ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య
- వైద్యురాలిగా సేవలు అందించిన ఎంపీ
- ప్రజలకు స్వయంగా బీపీ చెక్ చేసి మందులు అందజేత
- కూరపాటి ఫౌండేషన్ ట్రస్ట్ సేవలను అభినందనీయం
- బడుగు బలహీన వర్గాల కోసం మండలాల వారీగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
- ప్రజలు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలు ప్రతి ఏడాది ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి చేసుకోవాలి
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య





**వరంగల్ ప్రతినిధి, మార్చి 22,తరంగాలు** : వైద్యం అనేది వ్యాపారం కాకుండా మానవతా దృక్పథంతో చూడాల్సిన రంగమని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆదివారం కూరపాటి ఫౌండేషన్ ట్రస్ట్ సహకారంతో నిర్వహించిన "ఉచిత మెగా వైద్య శిబిరాన్ని" వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.మరోసారి తన వైద్య వృత్తిని స్మరింపజేస్తూ, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య శిబిరానికి వచ్చిన ప్రజలతో నేరుగా మమేకమై వారికి బీపీ చెక్ చేసి, వైద్య రిపోర్టులను పరిశీలించి, అవసరమైన మందులను స్వయంగా అందజేశారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఆత్మీయంగా అడిగి తెలుసుకుంటూ సేవాభావంతో వ్యవహరించడం అక్కడ అందరినీ ఆకట్టుకుంది.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని పేర్కొన్నారు. సేవా భావనతో కూరపాటి ఫౌండేషన్ ట్రస్ట్ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులను ప్రత్యేకంగా ఎంపీ అభినందించారు.స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు అధికంగా ఉన్నందున మండలాల వారీగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను తరచూ నిర్వహించి ప్రజలకు చేరువలోనే వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రస్తుతం 30–40 ఏళ్ల వయసులోనే హార్ట్ ఎటాక్‌లతో ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు 50 ఏళ్లు దాటిన తరువాత కనిపించే అనారోగ్య సమస్యలు ఇప్పుడు తక్కువ వయసులోనే వస్తున్నాయని పేర్కొన్నారు. కాబట్టి ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి సంవత్సరం వైద్య పరీక్షలు చేయించుకుంటూ, సరైన ఆహారం, జీవనశైలితో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యమే సమాజ అభివృద్ధికి పునాది అని పేర్కొంటూ ఆరోగ్యంపై అప్రమత్తత పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, ఉప సర్పంచ్ కొమురమ్మ సాయిపేట సర్పంచ్ లక్ష్మి, మండల అధ్యక్షులు గుర్రపు ప్రసాద్, కూరపాటి ట్రస్ట్ చైర్మన్ కూరపాటి రమేష్, డాక్టర్ సుస్మిత, ఇతర వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జనగణనపై బాధ్యతగా విధులు నిర్వహించాలి

• వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వరంగల్ ప్రతినిధి : మార్చి 22, తరంగాలు** :జనగణన ప్రక్రియపై పూర్తి అవగాహనతో బాధ్యతగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు.జనగణన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సిబ్బందికి సరైన శిక్షణ ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.
ఆదివారం బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరం (కంప్యూటర్ ల్యాబ్)లో ప్రిన్సిపల్ సెన్సస్ అధికారి హోదాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జనగణన--2027 నిర్వహణపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఛార్జ్ సెన్సస్ క్లర్కులు మరియు టెక్నికల్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, జనగణన ద్వారా ప్రభుత్వానికి అవసరమైన ఖచ్చితమైన గణాంకాలు అందుతాయని, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించి సరైన వివరాలను సేకరించడం సిబ్బందిపై ఉన్న ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.
శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బందికి విధివిధానాలపై సమగ్రంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. విధుల్లో నిబద్ధతతో పనిచేసి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సెన్సస్ అధికారి (డీఆర్ఓ) విజయలక్ష్మి, ముఖ్య ప్రణాళిక అధికారి చంద్రకళ, వరంగల్ ఆర్డీఓ సుమ, ఖిలా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, సంబంధిత అధికారులు (ఎంపీఎస్వోలు), టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

•హన్మకొండ మార్క్‌ఫెడ్ డీఎంతో ఫోన్‌లో మాట్లాడిన
•ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 22,తరంగాలు** :మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు అధికారులను ఆదేశించారు.
వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో రైతులు పండించిన మొక్కజొన్న పంటకు సరైన మద్దతు ధర కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు సూచించారు.హన్మకొండ జిల్లా హసన్పర్తి, ఐనవోలు మండలాల పరిధిలోని ప్రతి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్ )లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు హన్మకొండ మార్క్‌ఫెడ్ డీఎం శ్యామ్ తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.రైతులు తమ పంటను సరైన ధరకు విక్రయించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# మోటోక్రాస్ రేసింగ్‌తో దూసుకొస్తున్న 'బైకర్'..

### ట్రైలర్‌తో అంచనాలు పెంచిన శర్వానంద్!

టాలీవుడ్ హీరో శర్వానంద్ నటిస్తున్న తాజా చిత్రం 'బైకర్' ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో భారీ హల్‌చల్ సృష్టిస్తోంది. మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంలో రూపొందిన ఈ స్పోర్ట్స్ డ్రామా ఇండియన్ సినిమాల్లో అరుదుగా చూసే జానర్ కావడంతో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాలో శర్వానంద్ 'విక్కీ' అనే రేసర్ పాత్రలో స్టైలిష్ మేకోవర్‌తో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. దర్శకుడు అభిలాష్ రెడ్డి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. ట్రైలర్ చూస్తుంటే విజువల్స్, రేసింగ్ సన్నివేశాలు హాలీవుడ్ స్థాయిలో ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బైక్ రేసింగ్ అంటే ప్రాణం పెట్టే ఒక యువకుడు తన లక్ష్యం కోసం చేసే పోరాటాన్ని దర్శకుడు ఎమోషనల్‌గా చూపించబోతున్నట్లు అర్థమవుతోంది. ఈ సినిమాలో మరో ప్రధాన ఆకర్షణ రాజశేఖర్ పోషించిన తండ్రి పాత్ర. శర్వానంద్–రాజశేఖర్ మధ్య వచ్చే సన్నివేశాలు ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచాయి. తండ్రీకొడుకుల మధ్య ఉన్న భావోద్వేగాలకంటే, వారి మధ్య జరిగే ఇగో క్లాష్ కథకు కీలకంగా కనిపిస్తోంది. "నువ్వు అందరికంటే ముందు రాలేదు.. అందరూ నీకంటే వెనుక వచ్చారు" వంటి డైలాగ్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. టెక్నికల్ పరంగా కూడా సినిమా బలంగా కనిపిస్తోంది.

# కేజీబీవీ పాఠశాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





**హనుమకొండ ప్రతినిధి : 22 మార్చి, తరంగాలు :** జిల్లాలోని ఆత్మకూరు మండలం తిరుమలగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆదివారం సందర్శించి పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని 10వ మరియు 8వ తరగతి విద్యార్థినులతో మాట్లాడి, వారి చదువు ప్రగతిని, పరీక్షలకు సన్నద్ధతను గురించి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించాలని, లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని కృషి చేయాలని సూచించారు.అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల నిల్వలను తనిఖీ చేశారు. విద్యార్థినుల కోసం తయారు చేస్తున్న భోజనాన్ని కూడా పరిశీలించి నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు.పాఠశాలకు సంబంధించిన వివిధ అంశాలపై ప్రత్యేక అధికారి వాసవి కలెక్టర్‌కు వివరాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, తహసీల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# మానవ మనుగడకు నీరే ప్రాణాధారం



•ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం
• నీటి సంరక్షణపై కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపు

**వర్ధన్నపేట ప్రతినిధి,మార్చి 22,తరంగాలు** : మానవ మనుగడకు నీరే ప్రాణాధారమని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నీటి సంరక్షణ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు.రంగోలి ముగ్గులు, కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయకుండా మితంగా వినియోగించాలని సూచించారు. భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ విధానాలు, నీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. నీరు జీవానికి మూలాధారం కావున భవిష్యత్ తరాల కోసం దాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి






విధానాన్ని డెమో ద్వారా ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ సునీత, వర్ధన్నపేట తహసీల్దార్ విజయసాగర్, ఎంపీడీవో వెంకటరమణ, కొత్తపల్లి సర్పంచ్ సునీత–రాజేష్ ఖన్నా , స్థానిక అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.